క్లుప్తంగా

పన్ను చెల్లించాలి


పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లించే వారు పూర్తి పన్ను చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. మున్సిపాలిటీలో గతేడాది ఆస్తి పన్ను వసూల్లు అంతంత మాత్రంగానే ఉండగా, పాత బకాయిలను ప్రజలు స్వచ్ఛందంగా చెల్లించి, 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు పన్ను చెల్లింపుపై ఉన్న 5శాతం తగ్గింపు(రిబేటు)ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం పట్టణంలోని వి.మధుసూదన్ రెడ్డి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.2.65లక్షల పన్నును ఎర్లి బర్డ్ స్కీం ద్వారా మున్సిపాలిటీకి చెల్లించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజులు యోగా శిక్షణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఈ నెల 21నుంచి 23వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులను కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

మంచిర్యాలటౌన్: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఇతర జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్లు ఇస్తున్నారని, మంచిర్యాల జిల్లాలో ఇవ్వాలని లేనిపక్షంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశ్, సత్తయ్య, రాజేశ్, సాగర్, మధుసూదన్, లక్ష్మణ్, జాడి వెంకట్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాసిపేట: మండలంలో బుధవారం రోజున 33కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. కొండపూర్ సరఫరా ఫీడర్ మరమ్మతుల నిర్వహణతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం వినతిపత్రం ఇచ్చి బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి చట్టభద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, కో కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, నాయకులు అఖిల్, ఇన్నారం కిరణ్, కల్లా రమేష్ పాల్గొన్నారు.

బొట్టు పెడుతూ.. ఆహ్వానిస్తూ..

చెన్నూర్/కోటపల్లి: చెన్నూర్ పట్టణంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న కోటపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులకు, ఈ నెల 21న చెన్నూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులకు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్నారు. మల్లంపేట, కొండంపేట, సర్వాయిపేట గ్రామాల్లో కోటపల్లి ఎంపీపీ మంత్రి సురేఖా ఇంటింటా తిరుగుతూ బొట్టు పెడుతూ సమ్మేళనానికి రావాలని కోరగా, చెన్నూర్ పట్టణంలోని నాలుగు, ఐదు వార్డుల్లో మున్సిపాల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానించారు. పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి కుటుంబం హాజరుకావాలని కోరుతున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో ఆరోగ్య ఉపకేంద్రాలు 52 ఉండగా, ఇందులో 44 ఉప కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అరకొర వసతులతో వైద్యులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఈ దుస్థితిపై కథనం...



నెన్నెలలో అద్దె ఇంట్లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం

పల్లెవైద్యానికి సుస్తీ..!

- ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు కరువు
- సిబ్బందిపై కొరవడిన పర్యవేక్షణ
- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలు

నెన్నెల: జిల్లాలోని గ్రామీణులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారింది. భిన్నమైన వాతావరణ పరిస్థితుల కారణంగా దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో పల్లె జనాలు వైద్యం కోసం పట్టణాల బాట పడుతున్నారు. పల్లె ప్రజలకు వైద్య సేవలు అందించే ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకపోవడంతో పాటు ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో గ్రామీణులు వైద్యం కోసం ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సరైన సేవలు అందడం లేదు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 52హెల్త్ సబ్‌సెంటర్లలో 44అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎనిమిది సబ్‌సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి.

లక్ష్యం ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పింది. పీహెచ్‌సీ పరిధిలోని కొన్ని గ్రామాలను కలిపి ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రజలకు అత్యవసర ప్రాథమిక వైద్యసేవలు అందించాలని సంకల్పించారు. ఘనమైన ఆశయంతో ఏర్పాటు చేసిన ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేక అలంకార ప్రాయంగా మారాయి. సిబ్బంది స్థానికంగా ఉండకపోవడం, నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో రోగులకు వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి.

వసతులు లేని అద్దె కేంద్రాలు..

ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేని చోట ఇళ్లను అద్దెకు తీసుకొని ఏర్పాటు చేశారు. ఒక్కో సబ్‌సెంటర్ అద్దె రూ.500 నుంచి రూ.600వరకు చెల్లిస్తున్నారు. అద్దె కేంద్రాల్లో వెలుతురు, తాగునీరు, ఇతర సౌకర్యాలు లేని గదులు లభిస్తుండటంతో ప్రతి వారం పరీక్షల కోసం వచ్చే గర్భిణులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్య సామగ్రి రికార్డులు, ఇతర సామగ్రి ఉంచేందుకు స్థలం లేక అద్దె కేంద్రాల్లో సమస్యలతో రోగులు సతమతమవుతున్నారు. సిబ్బంది ఉండేందుకు సరైన వసతి లేకపోవడంతో గ్రామీణ వైద్యం దయనీయంగా మారింది.

ఉపకేంద్రాల ద్వారా వైద్యసేవలు ఇలా..

ఉపకేంద్రాల్లో అత్యవసర మందులతో పాటు జ్వరం, దగ్గు, విరేచనాలు, వాంతుల లాంటి జబ్బులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బీపీ పరీక్ష యంత్రం, బరువు తూగే యంత్రం అందుబాటులో ఉంటాయి. ఆరోగ్య ఉపకేంద్రాల్లో సౌకర్యాలు లేనందునా రోగులు రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఇరుకు అద్దె భవనాల కారణంగా మందులు నిల్వ చేసుకోవడానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాల కోసం నిధులు మంజూరు చేసి, నిర్మాణాలు చేపట్టి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

సౌకర్యాలు సరిగా లేవు



సబ్‌సెంటర్‌లో సౌకర్యాలు సరిగా లేవు. వైద్య పరీక్షలకు కోసం వెళ్తే ఇరుకు గదిలో వేడికి ఉండలేకపోతున్నాం. తాగునీరు కూడా అందుబాటులో లేదు. గదిలో స్థలం లేక బయట ఎండలో నిలబడాల్సి వస్తుంది. సొంత భవనం ఉంటే బాగుంటుంది.

– పోల్క మౌనిక, గర్భిణీ(నెన్నెల)

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- ట్రెయినీ కలెక్టర్ గౌతమి


రికార్డులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

భీమిని: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ట్రెయినీ కలెక్టర్, భీమిని ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌతమి అన్నారు. మండలంలోని మామిడిగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. బిట్టూర్‌పల్లిలో పెండింగ్‌లో ఉన్న బృహత్‌పల్లెప్రకృతివనం పనులను వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ ఎల్లాగౌడ్‌ను ఆదేశించారు. 'మనఊరు–మనబడి' పనులు ఎంత వరకు వచ్చాయని ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, ఏఈపీఆర్ రాంచందర్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులు శుక్రవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీఓ సబ్దర్‌ఆలీ, ఎంఈఓ మహేశ్వర్ రెడ్డి, పీఆర్ ఏఈ రాంచందర్ ఉన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణా సంస్థలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం మే 9వ తేదీలోగా అనాథ, నిరుపేద బాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను 10వ తరగతి పూర్తి చేసి, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు, తల్లి/తండ్రి కోల్పోయిన బాలికలు, నిరుపేద బాలికలకు ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నట్లు తెలిపారు. మూడు సంవత్సరాల పాటు డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాలికలు మంచిర్యాల పట్టణంలోని బాలరక్షా భవన్ కార్యాలయంలో మే 9వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 94415 06519, 7032462331 నంబరులో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

చెన్నూర్: పట్టణంలోని మారెమ్మవాడలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి, వారి వద్ద నుంచి కొంత నగదు, సెల్‌ఫోన్‌లతో పాటు మోటర్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా, పట్టుబడిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నట్లు సమాచారం. ఎస్సై మహేందర్‌ను వివరణకోరడానికి ప్రయత్నించగా, స్పందించలేదు.

ఇంటర్నేషనల్ బుక్ఆఫ్ రికార్డులో చోటు


సాయిరోహన్

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన కొంక సాయిరోహన్ ఇంటర్నేషనల్ బుక్ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అతను, ఇటీవల ఇంటర్నేషనల్ బుక్ఆఫ్ నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ సాధించాడు. మూలకాల వర్గీకరణ సింబల్స్‌ను ఒక నిమిషం 40సెకండ్లలో రాసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించాడు.

కార్మికులకు యూనిఫాంలు ఇవ్వాలి


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు యూనిఫాంలు, చెప్పులు అందించేలా చూడాలని కోరుతూ మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు వినతిపత్రం అందించారు. 60ఏళ్లు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుమారులను డ్యూటీలోకి తీసుకోవాలని, సమాన పనికి సమాన వేతనం అమలయ్యేలా చూడాలని, వేసవి కాలం దృష్ట్యా పని వేళలను మధ్యాహ్నం 12గంటల్లోపే పూర్తి చేసేలా అనుమతివ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ యండి సొహైల్‌ఖాన్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ దంపతులు, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, మోకుదెబ్బ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, నాయకులు నర్సగౌడ్, అంజగౌడ్, లింగన్నగౌడ్ పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక పాలకులకు బుద్ధి చెప్పాలి'


పార్టీలో చేరిన యువకులతో రమేశ్‌రాథోడ్

జన్నారం: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన చేపడుతూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. ఇంటింటా బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జన్నారం మండలం తపాలపూర్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ అవినీతి పాలనపై వివరించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని, సమస్యలను గాలికి వదిలి, దేశం ఏలుతానని ఇతర రాష్ట్రాలకు వెళుతూ, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాలు కంటితుడుపుగా మిగిలాయని ఆరోపించారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం పలువురు యువకులు బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ వెంకటస్వామి, జిల్లా, మండల నాయకులు మధుసూదన్‌రావు, దుబ్బ రాజన్న, కొమురయ్య, యుగేందర్, జగన్‌గౌడ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: వరంగల్ జిల్లాలోని కొత్తూరులో ఈ నెల 19న నిర్వహించే ఎంసీపీఐ(యూ) అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్ ద్వితీయ వర్ధంతి సభ, విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరించారు.

మెరుగైన వేతన ఒప్పందం సాధించాలి


కేకే-5గని మేనేజర్‌కు వినతి

మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: వేజ్‌బోర్డు చర్చల నేపథ్యంలో జాతీయ కార్మిక సంఘాలు మెరుగైన వేతన ఒప్పందం కోసం కృషి చేయాలని టీబీజీకేఎస్ నాయకులు పేర్కొన్నారు. చర్చల పేరిట జరుగుతున్న వేజ్‌బోర్డు జాప్యంపై మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్‌కే1ఏ గని, ఏరియా ఆసుపత్రిలో, మందమర్రి ఏరియాలోని కేకే–సీలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌కే1ఏ ఫిట్ కార్యదర్శి బండారి భిక్షపతి, సత్యనారాయణరెడ్డి, నెల్లి సదయ్య, అశోక్, మేకల రాజయ్య, నక్క సురేష్ పాల్గొనగా, మందమర్రిలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, జే.రవీందర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు


దండేపల్లి: సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని కన్నెపల్లి, నంబాల, ద్వారక, ధర్మరావుపేట, పెద్దపేట, కొత్తమామిడిపల్లి, గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీసీఎమ్మెఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీపీ శ్రీనివాస్, రైతుసమితి కన్వీనర్ గురువయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మనఊరు–మనబడితో వసతులు..

మనఊరు–మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.80లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమన్న, పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి, చైర్మన్ సత్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కన్నెపల్లిలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న వీఓఏలు


బెల్లంపల్లిరూరల్: ధర్నాలో వీఓఏలు


చెన్నూర్: సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె


కోటపల్లిలో నిరహారదీక్ష చేస్తున్న వీఓఏలు

భీమారం/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/భీమిని/చెన్నూర్/నెన్నెల/కోటపల్లి/మందమర్రిరూరల్/జైపూర్: దీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉంటున్న తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వీఓఏలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు కొనసాగిస్తుండగా, మంగళవారం 17రోజుకు చేరింది. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఐడీ కార్డులు అందజేయాలని, ప్రతి నెల వేతనాన్నీ వీఓఏ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వీఓఏల సమ్మెకు పలు మండలాల్లో ప్రజాప్రతినిధులు సంఘీభావం ప్రకటిస్తున్నారు. దండేపల్లిలో పలు అభివద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే దివాకర్‌రావుకు తమ సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు, జేపీఎస్‌లు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు.


నెన్నెల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట...


జైపూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..


భీమారం ఐకేపీ కార్యాలయం ఎదుట...

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, సౌమ్య, అభినయ, కల్పన, శ్రావ్య, నాగలక్ష్మి, శ్యామల, అక్షయ్, సత్యనారాయణ, అభినవ్, రాకేష్, కిరణ్, తేజ, మాంతయ్య, నితిన్, సాయి, జస్వంత్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.